సాక్షి
నారాయణపేట
శుక్రవారం ; 30 ; జూన్ ; 2023

"రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా.. రక్త బంధం విలువ నీకు తెలియదురా
నుదుటి రాతలు రాసే ఓ బ్రాహ్మ దేవా.. తల్లి మనసేమిటో నీవు ఎరుగవురా.."

అంటూ ఉద్యమ సమయంలో దేవుళ్లనే ప్రశ్నించిన ఆ గొంతుక మూగబోయింది. తన గళంతో యావత్ తెలంగాణను ఉర్రూతలూగించిన ఆ గానం ఇక వినిపించకపోయినా.. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయన పాట అజరామరంగా నిలిచిపోతుంది. ప్రజాగాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ (39) ఇక లేరు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం కారుకొండలో ఉన్న తన వ్యవసాయ క్షేత్రంలో ఉండగా బుధవారం అర్ధరాత్రి గుండెపోటు రావడంతో మరణించాడు. రాతి గుండెల్ని సైతం కరిగించిన ఆ గాత్రం ఇక వినబడదంటే.. తెలంగాణ మొత్తం కన్నీరు పెడుతోంది. **బరువైన హృదయాలతో ఆ ఉద్యమవీరుడికి జోహార్లు పలుకుతోంది.**

– అమరచింత



మూగబోయిన ఉద్యమగళం

- గుండెపోటుతో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ ఆకస్మిక మృతి
- నిరుపేద కుటుంబం నుంచి ఉద్యమం వైపు అడుగులు
- తండ్రి స్ఫూర్తితో జానపద గేయాలపై పట్టు
- అరుణోదయ కళాకారుడిగా అంచెలంచెలుగా ఎదుగుదల
- గాయకుడిగా రాష్ట్రస్థాయిలో కీర్తిప్రతిష్టలు

నిరుపేద కుటుంబంలో పుట్టిన సాయిచంద్ తన గాత్రంతో ఎనలేని కీర్తిప్రతిష్టలు సాధించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తన పాటలతో ప్రతి ఒక్కరిలోనూ ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. పాటలే ప్రాణపదంగా.. పాటలతో సామాజిక ఉద్యమ పాత్ర పోషించిన సాయిచంద్ ఇక లేరనే వార్త ఉమ్మడి పాలమూరులో విషాదం నింపింది. పుట్టి పెరిగిన గ్రామానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి తనకంటూ చెరగని ముద్ర వేసుకున్న ఆయన బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. తన తండ్రి వెంకట్రాములును స్ఫూర్తిగా తీసుకొని ఆయన పాడిన పాటలను పాడుతూ విద్యార్థి దశలోనే పీడీఎస్‌యూలో చేరి అరుణోదయ కళాకారుడిగా అంచెలంచెలుగా ఎదిగారు. తెలంగాణ మలి దశ పోరులో నిర్వహించిన ధూంధాం ప్రోగ్రాం ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి తన గానంతో ఉద్యమస్ఫూర్తిని రగిలించారు. పాటలే తన ఊపిరిగా మార్చుకుని విద్యార్థి దశ నుంచి విప్లవ బాటలో అడుగులు వేసి తెలంగాణ ఉద్యమంలో తనదైన పాటలతో ప్రజల ఆదరణ పొందిన అమరచింత ముద్దు బిడ్డ సాయిచంద్‌కు సీఎం కేసీఆర్ తగిన గుర్తింపు ఇచ్చారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల వెన్నంటి ఉన్న సాయిచంద్ సీఎం కేసీఆర్‌కు సన్నిహితుడిగా మారారు.

కేసీఆర్‌తో సాన్నిహిత్యం..

ఉద్యమ సమయంలో పాటలతో పరిచయమైన సాయిచంద్ అనతి కాలంలోనే కేసీఆర్‌కు సుపరిచితుడిగా మారారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత టీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారంతో పాటు సీఎం కేసీఆర్ సభా వేదికలపై సాయిచంద్ పాట లేనిదే కార్యక్రమం మొదలయ్యేది కాదనే స్థితికి తీసుకొచ్చారు. అలాంటి సమయంలో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సాన్నిహిత్యంతో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా సాయిచంద్‌కు సీఎం కేసీఆర్ సముచిత స్థానం కల్పించారు.



కుటుంబ నేపథ్యం..

అమరచింతకు చెందిన వీద వెంకట్రాములు, మణెమ్మలకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడైన సాయిచంద్ విప్లవ గాయకుడైన తన తండ్రి వెంకట్రాములును అనుకరించి పాటలపై ఆసక్తి పెంచుకున్నాడు. పదో తరగతి వరకు అమరచింతలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన ఆయన ఆత్మకూర్‌లో ఇంటర్, ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఏ పూర్తిచేశారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ, అరుణోదయ సాంస్కృతిక కళామండలి రాష్ట్ర సభ్యుడిగా కొనసాగారు. చివరికి తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో టీఆర్‌ఎస్‌లో చేరి ధూంధాం కార్యక్రమాల్లో రసమయి బాలకిషన్‌తో కలిసి ప్రజా ఉద్యమంలో ఆడిపాడారు. సాయిచంద్‌కు అన్న క్రాంతి, చెల్లెలు ఉజ్వల ఉండగా.. అన్న క్రాంతి ఆర్మీలో పనిచేస్తూ అనారోగ్యంతో మూడేళ్ల క్రితం మృతిచెందారు.



కుటుంబ సభ్యులు, భార్యాపిల్లలతో సాయిచంద్ (ఫైల్)

శోకసంద్రంలో అమరచింత

- సాయిచంద్ మరణవార్తతో కుప్పకూలిన తండ్రి

రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ సాయిచంద్ గుండెపోటుతో మృతిచెందాడనే వార్త తెలియగానే స్వగ్రామమైన అమరచింత శోకసంద్రంలో మునిగిపోయింది. సాయిచంద్ మరణ వార్త తెలియగానే తండ్రి వెంకట్రాములు భావోద్వేగంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. తండ్రి వెంకట్రాములు రోదనలు పలువురి హృదయాలను కలచివేశాయి. 'సాయి ఎక్కడున్నావు రా.. ఎందుకిలా జరిగిందిరా.. దేవుడా మాకెందుకు అన్యాయం చేశావు' అంటూ తండ్రి రోదనలతో స్థానికులచే కంటతడి పెట్టించాయి. గ్రామంలోని బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు సాయిచంద్ ఇంటికి వెళ్లి తండ్రి వెంకట్రాములును ఓదార్చారు. వెంకట్రాములుతో కలిసి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. గ్రామంలో సాయి మిత్రమండలితోపాటు బీఆర్‌ఎస్ నాయకులు సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పించారు.



అమరచింతలోని సాయిచంద్ స్వగృహం వద్ద రోదిస్తున్న తండ్రి వెంకట్రాములు

గుర్తింపు తెచ్చిన పాటలు..

సాయిచంద్ తన ఉద్యమంతోపాటు విద్యార్థి దశలో పీడీఎస్‌యూలో కొనసాగుతున్న సమయంలో వంద పైచిలుకు సొంతంగా పాటలు రాశారు. వీటితోపాటు ఆల్బం చేశారు. అదే సమయంలో తెలంగాణ ఉద్యమ సమయంలో ధూంధాం కార్యక్రమానికి ఆకర్షితుడై పాటలు రాయడం, పాడటం అలవాటుగా మారిందని సన్నిహితులు చెబుతున్నారు. ఉద్యమ సమయంలో శ్రీకాంతాచారి బలిదానంపై పాడిన పాట 'రాతిగుండెల్లోన కొలువైన శివుడా.. అన్న పాట యావత్ తెలంగాణ ప్రజలను కన్నీరు పెట్టించింది. వీటితోపాటు ఎవరు చెప్పారురా నీ కులం చిన్నదని, ఎవరు చెప్పారురా నీ కులం పెద్దదని.. ఇద్దరం పుట్టింది తల్లి గర్భంలోనే అన్న పాటకు విశేష ఆదరణ లభించింది. అలాగే నాన్న.. నాన్న నీవు ఎంత గొప్పోడివి అన్న పాటతో పాటు రెవెన్యూ ఉద్యోగుల సమ్మె సమయంలో.. టీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో పాడిన పాట కారు.. సర్కారు.. కేసీఆర్ అన్న పాట ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయి.



పీడీఎస్‌యూలో కొనసాగుతున్న సమయంలో సాయిచంద్ నాటక ప్రదర్శన, పాట పాడుతున్న సాయిచంద్ (ఫైల్)

ఏడాదికోసారి సరదాగా..

- సాయిచంద్‌తో అనుబంధం మరువలేనిదంటున్న స్నేహితులు

- వివరాలు 8లో

సొంతూరిపై మమకారం ఎక్కువే..

పుట్టి పెరిగిన ఊరి ప్రజల రుణం తీర్చుకోవాలనే సంకల్పంతో తన చైర్మన్ పదవీకాలం ముగిసే వరకైనా గిడ్డంగులను నిర్మించాలనే సాయిచంద్ తపన ఎట్టకేలకు నెరవేరింది. 10వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంల నిర్మాణం కోసం సీఎం కేసీఆర్‌ను ఒప్పించి రూ.10 కోట్ల నిధులను మంజూరు చేయించుకున్నారు. ఈ మేరకు జూన్ 5న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ధర్మాపురం శివారులో శంకుస్థాపన చేయించారు. నాలుగు నెలల్లోగా పనులను పూర్తి చేయిస్తానని ఇచ్చిన హామీ ప్రకారం గోదాం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సాయిచంద్ తన గ్రామంతో పాటు మండలాన్ని సైతం అన్నిరంగాల్లో రాణించాలని ఇక్కడి విద్యార్థులు, యువకులు తమ లక్ష్యాలను సాధించాలని వీటి కోసం తనవంతు సహకారం అందిస్తానని స్థానిక రాజకీయ, విద్యార్థి సంఘాల నాయకులతో తరచుగా చెప్పేవారని సాయి సన్నిహితులు పేర్కొన్నారు.



ధర్మాపురం శివారులో గిడ్డంగి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెంతో సాయిచంద్ (ఫైల్)

వెలుగొమ్ములలో విషాదం

మిడ్జిల్: సాయిచంద్ మృతితో తన అత్తగారి గ్రామమైన మండలంలోని వెలుగొమ్ములలో విషాదం అలుముకుంది. గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి, లక్ష్మి దంపతుల రెండో కూతురు, ఆర్టిస్ట్ రజినిని 2011లో పెద్దల సమక్షంలో ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో పలుమార్లు వెలుగొమ్ములకు వచ్చిన సాయిచంద్‌కు పలువురు గ్రామస్తులతో సత్సంబంధాలు ఉన్నాయి. గ్రామంలో జరిగే బ్రహ్మోత్సవాలకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చేవారని గ్రామస్తులు గుర్తుచేశారు. ఆయన పాటలు గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకునేవని, మంచి గాయకుడిని కోల్పోయామని ఆవేదన వెలిబుచ్చారు. సాయిచంద్ మృతి పట్ల మిడ్జిల్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు శశిరేఖ, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పాండుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సాయిచంద్‌కు గిడ్డంగుల చైర్మన్ పదవి ఇవ్వడంతో అభినందనలు తెలుపుతున్న వెలుగొమ్ముల గ్రామస్తులు (ఫైల్)



అభివాదం చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తదితరులు

రాష్ట్రాన్ని దివాలా తీయిస్తుండ్రు

- దశాబ్ది ఉత్సవాలంటూ ఉన్నది పక్క రాష్ట్రాలకు పంచిపెట్టారు
- అన్ని అభివృద్ధి పనులకు నిధులిచ్చింది మేమే..
- కేసీఆర్‌కు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు
- ఆత్మకూర్ బహిరంగసభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

ఆత్మకూర్: రాష్ట్ర అభివృద్ధి కోసం నిధులన్నీ కేంద్రం నుంచి మంజూరు చేస్తే వాటిని తమ సొంత నిధులంటూ ప్రచారం చేసుకొంటూ.. ఉన్నది పక్క రాష్ట్రాలకు పంచి పెడుతూ రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ప్రజాధనాన్ని సీఎం కేసీఆర్ సొంత ఆస్తుల్లా ఖర్చు చేయడం ఏమిటని ప్రశ్నించారు. గురువారం వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లోని బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర సంపదను అప్పనంగా ఖర్చు పెడుతూ పేదల నోట్లో మట్టి కొడుతున్న సీఎం కేసీఆర్‌కు ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు నెరవేర్చలేని పరిస్థితిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందని ఆరోపించారు. సకల సంపదలు కలిగి విభజన సందర్భంలో మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఉన్న తెలంగాణను నేడు అప్పుల తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని విమర్శించారు. రాష్ట్రంలో డబుల్ బెడ్‌రూంల పేరు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని, కేంద్రం ఇచ్చిన ఇళ్లను మింగేశారని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ కుటుంబం ఆస్తులు పెంచుకొన్నారని ఆరోపించారు. కారు.. పదహారు.. సర్కారు అన్న సీఎం కేసీఆర్ నేడు 16 శాతం కూడా ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. సింగిల్ డిజిట్‌తో రైతులకు రూ.లక్ష ఉన్న బ్యాంకు రుణాలను మాఫీ చేస్తామన్న హామీని విస్మరించి రైతుల నోట్లో మట్టి కొట్టారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అటకెక్కాయని, కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తే.. ఆయా పథకాలకు మారు పేర్లు పెట్టి తనవిగా చెప్పుకొంటూ ప్రచారం చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని ఆవాజ్ యోజన ద్వారా రాష్ట్రానికి రెండున్నర లక్షల ఇండ్లను మంజూరు చేస్తే వీటిని ప్రజలకు ఎందుకు ఇవ్వలేదో సమాదానం చెప్పాలని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ఎన్నికల జిమ్మిక్కులతో కాకుండా దేశాన్ని సుభిక్షంగా పరిపాలించే సత్తా బీజేపీకే ఉందని, ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రపంచ దేశాలు కీర్తించే స్థాయికి దేశాన్ని తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో రావణుల రాజ్యం తరమికొట్టి.. రామరాజ్యం స్థాపన కోసం ప్రజలు బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రజలందరూ బీజేపీ వైపు చూస్తున్నారని, ఇక తమ పార్టీకి ఇక్కడ టికాణా లేదని ఇతర రాష్ట్రాల పర్యటనకు సీఎం కేసీఆర్ వెళ్లడమే ఇందుకు నిదర్శనం అన్నారు. మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రజలు బీజేపీకి అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

సుష్మాస్వరాజ్‌తోనే..

పార్లమెంట్‌లో బీజేపీ నాయకురాలు దివంగత సుష్మాస్వరాజ్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం స్వరం లేవనెత్తడం వల్లే అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రం ఇచ్చిందని బండి సంజయ్ గుర్తుచేశారు. 1,400 అమరుల ఆత్మబలిదానాలతో సిద్ధించిన తెలంగాణలో బలిదానాలు చేసుకున్న వారంతా పేదలు అయితే.. కుటుంబంలో ఏ ఒక్కరు బలిదానం చేసుకోకుండా అధికారంలోకి వచ్చిన కేసీఆర్ రూ.వేల కోట్లకు అధిపతి ఎలా అయ్యాడని ప్రశ్నించారు. ఏమీ లేని కాంగ్రెస్‌ను జాకీలు పెట్టి లేపుతున్నాడని, కాంగ్రెస్ పార్టీకి అభ్యర్థులే లేరని కర్ణాటక సాకు చూపి ఏదో చేయాలనుకుంటున్నారని పేర్కొన్నారు. మక్తల్ నియోజకవర్గంలోని ఆత్మకూర్‌లో జరిగిన బీజేపీ బహిరంగ సభను టీవీలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూస్తున్న కేసీఆర్‌కు జై బీజేపీ.. జై మోదీ.. జైశ్రీరాం అనే నినాదాలు నిద్ర లేకుండా చేస్తాయని, మక్తల్ గడ్డలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, నాయకులు శాంతి కుమార్, జలేందర్‌రెడ్డి, కొండయ్య, నాగూరావు నామాజీ, సుభాష్ చందర్‌జీ, రాజవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, అశ్విని కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, నాగేందర్‌రెడ్డి, గంగాధర్, రాజు, అశోక్‌కుమార్, భాస్కర్, వెంకటేశ్వర్లు, నారాయణ, ఆనంద్, శివశంకర్, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్ సభకు హాజరైన పార్టీ కార్యకర్తలు, అభిమానులు

'కురుమూర్తిస్వామి'కి లక్ష పుష్పార్చన

ఆషాఢ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని గురువారం చిన్నచింతకుంట మండలం అమ్మాపురం కురుమూర్తిస్వామి ఆలయంలో లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు.

8లో



భక్తిశ్రద్ధలతో బక్రీద్

- ఈద్గాల వద్ద ముస్లింల సామూహిక ప్రార్థనలు
- జిల్లా కేంద్రంలో శుభాకాంక్షలు తెలిపిన రాజకీయ నాయకులు



జిల్లా కేంద్రంలో ఈద్గా దగ్గర ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

నారాయణపేట టౌన్: జిల్లా వ్యాప్తంగా పవిత్ర బక్రీద్ పండుగ వేడుకలను గురువారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి, మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రంలోని బువ్వమ్మగుట్ట సమీపంలో వెలసిన ఈద్గా వద్ద ముస్లిం మతపెద్దలు ఖుర్బాని గొప్పతనం గురించి క్లుప్తంగా వివరించారు. అనంతరం ముస్లిం సోదరులు సామూహికంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లింలు ఈద్గా దగ్గర భారీ సంఖ్యలో పాల్గొని ముస్లింలు ఒకరిని ఒకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఈద్గా దగ్గరలో స్వాగత వేదిక వద్ద వివిధ పార్టీ నాయకులు హాజరై ముస్లింలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గందె చంద్రకాంత్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిట్టెం అభిజయ్‌రెడ్డి ముస్లింలను పండుగ శుభాకాంక్షలు తెలిపి ఆలింగనం చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఓం ప్రకాశ్, బీఆర్‌ఎస్ నాయకులు సుదర్శన్‌రెడ్డి, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు విజయ్‌సాగర్, చెన్నారెడ్డి, సరాఫ్‌నాగరాజ్, కాంగ్రెస్ సుజేంద్రశెట్టి, సుధాకర్, శరణప్ప, ఆయా పార్టీ నాయకులు వార్డు కౌన్సిలర్లు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.



ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపి ఆలింగనం చేసుకుంటున్న నాయకులు

ఈవీఎంల మొదటి దశ పరిశీలన

నారాయణపేట రూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఈవీఎంల మొదటి స్థాయి తనిఖీ పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఈవీఎంల గోడౌన్‌లను తెరిచి ఎఫ్‌ఎల్‌సీ నిర్వహించారు. కలెక్టర్ అక్కడికి వచ్చి పర్యవేక్షించి అధికారులతో మాట్లాడారు. అదేవిధంగా ఈవీఎంల పరిశీలనకు సంబంధించి హాజరైన తొమ్మిది మంది ఇంజనీర్ల బృందానికి సందేహాలను అడిగి తెలుసుకున్నారు. అన్ని పార్టీల ప్రతినిధులకు విపులంగా వివరించాలని, వారు అడిగే సందేహాలను నివృత్తి చేయాలన్నారు. జూలై 7వరకు జరిగే ఈ కార్యక్రమం ప్రతిరోజు ఉదయం 9నుంచి సాయంత్రం 7వరకు ఉంటుందన్నారు. ఎన్నికల సామగ్రికి సంబంధించిన మూడు వేల ఈవీఎంలు, బియూ, సీయూ, వీవీప్యాట్స్ వచ్చాయన్నారు. ప్రతీ అంశాన్ని వీడియోగ్రఫీ చేపట్టాలని, అన్నిచోట్ల సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈవీఎంల విషయంలో ఏమైనా సమస్యలు వస్తే అధికారుల దృష్టికి తీసుకుని రావాలన్నారు. ఈసమావేశంలో అడిషనల్ కలెక్టర్ మయాంక్ మిట్టల్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



గోడౌన్‌లో ఈవీఎంల పరిశీలనతో పాల్గొన్న కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

స్ట్రాంగ్ రూం భద్రత పరిశీలన..

ఈవీఎంల పరిశీలన కార్యక్రమం సందర్భంగా బందోబస్తును జిల్లా పోలీసు యంత్రాంగం మరింత పెంచింది. అవసరమైన భద్రత ఏర్పాట్లను ఏఎస్పీ నాగేంద్రుడు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న సిబ్బందికి సూచనలు చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించిన ధ్రువీకరణ పత్రం, ఐడీకార్డు పరిశీలించి లోపలికి అనుమతించాలన్నారు. స్టాఫ్‌కు సైతం ఐడీకార్డులు ఉంటేనే అనుమతించాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ముగిసిన జాలిఫోనిక్స్‌పై శిక్షణ

నారాయణపేట రూరల్: జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 1, 2 తరగతులకు ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయులకు నిర్వహించిన జాలిఫోనిక్స్ శిక్షణ గురువారం ముగిసింది. స్థానిక గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమం రెండు విడతల్లో ఒక్కొక్కరికీ రెండు రోజుల చొప్పున జరిగింది.

క్లుప్తంగా

చెరువులో బోల్తాపడిన వాహనం: ఒకరు మృతి


చైతన్య కుమార్ (ఫైల్)

రాజోళి: చెరువులో బొలెరో వాహనం బోల్తా పడటంతో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని ఏలూరు జిల్లా పత్తిపాలంకు చెందిన చైతన్య కుమార్(28) మండలంలోని తుమ్మిళ్ల వద్ద చేపలచెరువును లీజుకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. రోజూలాగానే గురువారం చెరువులోని చేపలకు దాన వేసేందుకు బొలెరో వాహనాన్ని రివర్స్‌లో చెరువు వద్దకు తీసుకెళ్తుండగా.. అదుపు తప్పింది. గమనించిన ఆయన, వాహనం నుంచి కిందకు దూకేలోగా, వాహనం ఆయన మీద పడిపోయింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి రెండు సంవత్సరాల కిందట వివాహమైంది. భార్య రూపావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హెడ్‌కానిస్టేబుల్ తెలియజేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో షెడ్ దగ్ధం



కోడేరు: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఎల్రక్టానిక్ షెడ్ దగ్ధమై దాదాపు రూ.కోటి విలువైన ఆస్తి నష్టం జరిగిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం తీగలపల్లిలో గురువారం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. తీగలపల్లి గ్రామ శివారులో పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు జరుగుతుండగా.. సంబంధిత కంపెనీ ఎల్రక్టానిక్ పరికరాల కోసం ఓ షెడ్ ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ఎల్రక్టానిక్ షెడ్‌లో ఎవరూ లేని సమయంలో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. మధ్యాహ్నం సమయం కావడంతో అక్కడ పని చేస్తున్న సిబ్బంది, కార్మికులు భోజనానికి వెళ్లారు. మంటలు భారీగా చెలరేగడంతో షెడ్‌లో ఉన్న విలువైన పెయింట్ బాక్స్‌లు, కెమికల్, వెల్డింగ్ రాడ్స్, కూలింగ్ మిషన్లు, ఫైబర్ కేబుల్స్ పూర్తిగా దగ్ధమయ్యాయి. అలాగే 20 సిలిండర్లు ఉండగా 5 సిలిండర్లు పేలి కొద్దిదూరంలో పడిపోయాయి. సమీపంలో ఉన్న సిబ్బంది గమనించి అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే కొల్లాపూర్ సీఐ యాలాద్రి, కోడేరు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి, పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ రాజు, రాఘవేంద్ర, అగ్నిమాపక సిబ్బందితో అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో రూ.కోటి వరకు ఆస్తినష్టం జరిగిందని కంపెనీ సిబ్బంది చెప్పారు. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఆలయ గుండంలో వందేళ్లనాటి నాణేలు లభ్యం



కొల్లాపూర్ రూరల్: మండలంలోని అంకిరావుపల్లి సమీపంలో నిచ్చన కొండయ్య గుట్టపై వెలసిన మదన గోపాలస్వామి ఆలయ ఆవరణలో ఉన్న గుండంలో వందేళ్ల క్రితం నాటి నాణేలు లభ్యమయ్యాయి. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు తెలిపిన ప్రకారం.. ప్రతి ఏకాదశి రోజు స్వామి వారిని దర్శించుకోవడానికి గుట్టపైకి వందలాదిమంది భక్తులు వస్తుంటారు. కాగా.. గురువారం ఉదయం గ్రామస్తులు మట్టితో పూడిపోయిన గుండం పూడికతీత పనులు చేపట్టారు. దాదాపు 30 అడుగుల మేర పూడిక తీసిన తర్వాత వందేళ్ల క్రితం నాటి నాణేలు బయటపడ్డాయి. దాదాపు 60 నాణేలు దొరికాయని, వాటిపై 1897, 1912, 1920, 1938, 1946 సంవత్సరానికి చెందినవిగా ఉన్నాయి. ఈ ఆలయాన్ని సురభిరాజుల కాలంలో నిర్మించారు. కొన్నేళ్లుగా స్వామివారికి పూజలు చేసేవారు లేక పెద్దగా ప్రాచుర్యానికి నోచుకోలేదు. పదేళ్ల నుంచి గ్రామస్తులే ప్రతి ఏకాదశి రోజు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అందులోభాగంగానే గుండను శుభ్రం చేస్తుండగా నాణేలు దొరకడంతో గ్రామస్తులే తీసుకొని దాచేసుకున్నారు.

పరిశ్రమ పనులు నిలిపి వేయాలని ఆందోళన

రాజాపూర్: కాలుష్య కారక పరిశ్రమను తమ గ్రామ పరిధిలో నిర్మించవద్దని గురువారం మండలంలోని దొండ్లపల్లి శివారులో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. టొబాకో పరిశ్రమను స్థాపించి తమ ప్రాణాలతో చెలగాటం ఆడవద్దని దొండ్లపల్లి, కుత్నేపల్లి, చొక్కంపేట గ్రామాల ప్రజలు కోరారు. పరిశ్రమ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, కాలుష్యకారక పరిశ్రమలు నెలకొల్పవద్దని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పోలేపల్లి శివారులో పరిశ్రమలు వదులుతున్న కాలుష్యం కారణంగా రైతులు పడుతున్న అవస్థలు చూస్తున్నామని, అలాంటి పరిశ్రమలు ఇక్కడ నెలకొల్పి మమ్మల్ని ఇబ్బందులకు గురిచేయొద్దని కాంగ్రెస్ నాయకుడు దొండ్లపల్లి కృష్ణయ్య చెప్పారు. కృష్ణయ్య, బంజానాయక్, అనిల్, తిరుమలేష్ పాల్గొన్నారు.

పాలపల్లె

పాడి పరిశ్రమకు నిలయంగా బోయిన్‌పల్లి


బోయిన్‌పల్లి కేంద్రంలో పాలు విక్రయిస్తున్న రైతు

ఆ గ్రామంలో తెల్లారిందంటే పాడి గేదెలు, గోవుల వద్ద హడావుడి మొదలవుతుంది. రైతులు, యువకులు, మహిళలు తమ ఇంటి ఆవరణలో, పశువుల కొట్టాలో పాలు పితుకుతూ.. క్యాన్‌లలో పాలు పోస్తూ.. సైకిళ్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలలో పాలు తరలిస్తూ.. పాలకేంద్రం వద్ద నేనంటే నేను ముందంటూ సందడి చేస్తూ కనిపిస్తారు. గ్రామంలో చాలామంది ప్రత్యామ్నాయంగా పాడి పరిశ్రమను నమ్ముకుని రెండు చేతులా సంపాదిస్తున్నారు.

– చెంచటి హరిప్రసాద్, మహబూబ్‌నగర్ డెస్క్

దాదాపు వంద కుటుంబాలకు జీవనోపాధి

- ఒక్కొక్కరు 15 నుంచి 100 లీటర్ల వరకు పాల ఉత్పత్తి
- యువతకు జీవనోపాధి.. రైతులకు పెట్టుబడి
- ప్రతిరోజూ బల్క్ మిల్క్ సెంటర్‌లో 8 వేల లీటర్ల సేకరణ

మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలకేంద్రానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బోయిన్‌పల్లిలో ఎనిమిదేళ్ల క్రితం అన్ని ఊళ్ల మాదిరిగానే ఒకరిద్దరు మాత్రమే పాలను విక్రయించేవారు. ఐదారు కుటుంబాలకే పాడి పశువులు ఉండేవి. గ్రామం మొత్తం కలిపితే 30–40 లీటర్ల పాల ఉత్పత్తి జరిగేది. అలాంటి ఊళ్లో నేడు ఊహకందని తరహాలో పాల ఉత్పత్తి జరుగుతోంది. జడ్చర్ల, మిడ్జిల్, కల్వకుర్తి తదితర ప్రాంతాల్లో ఎక్కడి పాలంటే బోయిన్‌పల్లివి అనే నానుడి సంపాదించింది. రోజుకు వేల లీటర్ల పాలు ఈ ఒక్క గ్రామం నుంచే సేకరిస్తున్నారు. ప్రస్తుతం దాదాపు 100 కుటుంబాల వరకు పాడిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నాయి. డిగ్రీలు చేసిన యువత సైతం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా పాడిపరిశ్రమ ఏర్పాటుకు మొగ్గుచూపుతున్నారు. ఒక్కో పాల ఉత్పత్తిదారుడు రూ.16 వేల నుంచి రూ.లక్ష వరకు ప్రతినెలా ఆదాయం పొందుతున్నారనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. గ్రామంలో ప్రభుత్వ డెయిరీ కొనసాగుతుండగా.. దీనిద్వారా ప్రతినెలా గ్రామంలో దాదాపు రూ.20 లక్షల వ్యాపారం జరుగుతోంది.


రైతుల పాలను ఫ్యాట్ తీస్తున్న దృశ్యం

స్థానికంగానే బల్క్ కూలింగ్ సెంటర్

పాల ఉత్పత్తిలో ముందంజలో ఉన్న బోయిన్‌పల్లిలో ప్రభుత్వం బల్క్ కూలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ ప్రతి రోజు బోయిన్‌పల్లితో పాటు చుట్టుపక్కల 23 గ్రామాల నుంచి సేకరించిన దాదాపు 8 వేల లీటర్ల పాలను నిల్వ చేసి హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నారు. పాడి రైతులకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం కూడా మరింత అందిస్తే ఈ గ్రామం మిగతా ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తుంది.

నాడు అదనం.. నేడు అదే ఆదాయం

ఒకప్పుడు వ్యవసాయానికి చేదోడు వాదోడుగా ఉండి అదనపు ఆదాయం కోసం ఒకటి, రెండు పాడి గేదెలు, ఆవుల ద్వారా పాలను ఉత్పత్తి చేసే రైతులుండేవారు. కాలక్రమేణా వర్షాభావం, భూగర్భజలాలు అడుగంటడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం తదితర కారణాలతో పంటల సాగును గణనీయంగా తగ్గించారు. కేవలం వర్షాధార పంటల సాగుకు మాత్రమే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా పాల ఉత్పత్తిపై రైతాంగం దృష్టిసారించింది. ఆవులు, గేదెలకు సరిపడా పచ్చగడ్డిని సైతం రైతులే సాగు చేసుకుంటూ పాల ఉత్పత్తిని పెంచుకుంటున్నారు. నాడు అదనపు ఆదాయంగా ఉన్న పాడి పరిశ్రమ.. నేడు అదే ప్రధాన ఆదాయ వనరుగా మారింది. కేవలం పాడి ఆదాయంతో కొందరి కుటుంబాలు జీవనం సాగించే గొప్ప స్థితికి చేరాయి. పిల్లలకు మంచి చదువులు చెప్పించేందుకు, కుటుంబ ఆర్థిక పరిస్థితుల మెరుగుదలకు ఈ పాడి పరిశ్రమ ఎంతో తోడ్పాటునందిస్తుంది.



పాల ద్వారా ఉపాధి



నిత్యం 20 లీటర్ల పాలను గ్రామంలోని పాల ఉత్పత్తి కేంద్రంలో పోస్తున్నాను. లీటరుకు 40 రూపాయలు చెల్లిస్తున్నారు. క్రమం తప్పకుండా 15 రోజులకు ఒకసారి బిల్లు బ్యాంకు అకౌంట్‌లో జమ అవుతుంది. ప్రభుత్వం మరింత ప్రోత్సహించి ఇంకొంచెం ధర పెంచితే బాగుంటుంది.

– కేశ మల్లేష్, బోయిన్‌పల్లి

పంట సాగుకు తోడు అవుతున్నాయి..



పాలను అమ్మడం వలన 15 రోజులకు ఒకసారి బిల్లు రావడంతో వ్యవసాయం సాగుకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. కూలీలకు, ఎరువులకు అవసరం అయిన సమయంలో పాల బిల్లు వస్తుండడంతో.. వ్యవసాయం చేసేందుకు కూడా ఎలాంటి ఇబ్బందులు కలగడం లేదు.

– సురేష్ ,బోయిన్‌పల్లి

మంచి ధర వస్తుంది..



నిత్యం ఉదయం, సాయంత్రం కలిసి 15 లీటర్లు ఆవు పాలు కేంద్రంలో పోయడం వల్ల లీటరుకు 40 రూపాయల పైగా వస్తుంది. ఎప్పటి ధర అప్పుడే తెలుస్తుంది, ఫ్యాట్‌ను బట్టి ధర వస్తుంది. ఫ్యాట్ ఎంత ఎక్కువగా ఉంటే అంత ధర వస్తుంది.

– రాంచంద్రరెడ్డి, బోయిన్‌పల్లి

ఆసరాగా ఉంటుంది..



నాకు ఉన్న మూడు ఆవులకు సంబంధించిన పాలను నిత్యం కేంద్రంలో పోయడం వల్ల సకాలంలో డబ్బులు చేతికి వస్తుండడంతో ఎంతో ఆసరాగా ఉంటుంది. పాలు విక్రయించడం వల్లే కుటుంబ అవసరాలు తీరుతున్నాయి. సాగు కంటే పాల ఉత్పత్తి మేలు అనిపిస్తుంది.

– రామకృష్ణ, మిడ్జిల్

రూ.46.50 లక్షల సొంత నిధులతో..



బోయిన్‌పల్లిలో బీఎంసీయూ రూ.46.50 లక్షల నిధులతో అన్ని హంగులతో బల్క్ చిల్లింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. ఈ సెంటర్‌కు 23 గ్రామాల నుంచి దాదాపు నిత్యం 8 వేల లీటర్ల పాలు వస్తాయి. చిల్లింగ్ చేసిన తర్వాత హైదరాబాద్‌కు తరలించారు. చిల్లింగ్ సెంటర్ విజయవంతంగా కొనసాగుతోంది. ప్రభుత్వం సహకరిస్తే మరింత అభివృద్ధి చేస్తాం.

– రవీందర్‌రెడ్డి, బీఎంసీయూ చైర్మన్, బోయిన్‌పల్లి

సంజీవకొండలో చిరుత సంచారం



మరికల్: మండలంలోని పూసల్‌పహాడ్ పరిధిలోని సంజీవకొండలో రెండు నెలల నుంచి ఓ చిరుత సంచారం చేస్తోంది. అక్కడి రైతులను, గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం అర్ధరాత్రి పొల్కంపల్లి ఆంజనేయులు అనే రైతు వ్యవసాయ పొలం వద్ద ఉన్న పశువుల కొట్టం వద్దకు వచ్చిన చిరుతను కుక్కలు వెంబడించడంతో వాటిలో ఓ కుక్కను ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతు తెలిపారు. రాత్రి వర్షం కురువడంతో చిరుత పాద ముద్రలు గుర్తుపట్టారు. రెండు నెలల నుంచి చిరుత ఇక్కడ తమకు కంటిమీద కునుకులేకుండా చేస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుతను పట్టుకోవాలని కోరుతున్నారు.

మరోసారి కనిపించిన అడవి దున్న



మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం నల్లమల అటవీ సరిహద్దు ప్రాంతం ఫర్హాబాద్ చౌరస్తా సమీపంలో శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి దాటుతూ అడవి దున్న అటవీశాఖ పెట్రోలింగ్ బృందానికి బుధవారం మరోసారి కనిపించింది. రెండు నెలల క్రితం కర్ణాటక అడవుల నుంచి నల్లమల అటవీ ప్రాంతానికి వచ్చిన ఈ దున్న భౌరాపూర్ పెంట సమీపంలో సీసీ పుటేజీలో కనిపించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి అటవీశాఖ అధికారులు దాని కదలికల గురించి పరిశీలిస్తున్నప్పటికి ఎక్కడా కనిపించలేదు. ఆరోగ్యంగా చురుకుగా ఉన్న ఈ దున్న అకస్మాత్తుగా రోడ్డు దాటుతూ అటవీశాఖ సిబ్బందికి కనిపించడంతో సెల్‌ఫోన్‌లలో బంధించారు. కొన్ని నెలలుగా ఈ పరిసర ప్రాంతాల్లోనే సంచరిస్తున్న అడవి దున్నకు తోడుగా గేదెలను నల్లమలలో వదిలితే ఈ అరుదైన జంతువుకు సంబంధించిన సంతానోత్పత్తి కలిగే అవకాశంపై అధికారులు ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉండగా పులుల రక్షిత ప్రాంతమైన నల్లమలలో పెద్ద పులుల సంఖ్య కూడా ఆశించిన స్థాయిలో గణనీయంగా పెరుగుతుంది. బలిష్టంగా ఉండే అడవి దున్నలను పెద్దపులి ఆహారంగా తీసుకున్నట్లయితే చాలా రోజుల పాటు వేటాడే అవసరం కూడా పెద్దపులికి ఉండదని అధికారులు భావిస్తున్నారు.

ఏడాదికోసారి సరదాగా..

- సాయిచంద్‌తో అనుబంధం మరువలేనిదంటున్న స్నేహితులు

అమరచింత: ప్రజా గాయకుడు, తెలంగాణ ఉద్యమ గాయకుడిగా రాష్ట్ర ప్రజలకు సుపరిచితుడిగా, తెలంగాణ గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ తమతో సాదాసీదాగా గడిపేవారని స్నేహితులు చెప్పారు. ఏడాదికోసారి తమతో కలిసి సరదాగా తిరిగేవారని పేర్కొన్నారు. సాయిచంద్ ఎంత ఎదిగినా మాతో తరుచుగా మాట్లాడేవారు. ఏడాదికి ఒకసారి సాయిచంద్ తన తల్లి జ్ఞాపకార్థం నిర్వహించే కార్యక్రమానికి అందరినీ ఆహ్వానించేవారు. స్నేహితులతో గడిపిన రోజుల్లో ఏనాడు పేద, గొప్ప అన్న తేడా చూపేవారు కాదు. సాయిచంద్ మరణ వార్తను జీర్ణించుకోలేకపోతున్నామని, సాయి ఇప్పటికీ తమతో ఉన్నాడనే భావనలో ఉన్నామని కన్నీటి పర్యంతమయ్యారు. సాయిచంద్ ఆకస్మిక మృతితో అమరచింతలో ఆయనతో కలిసి చదువుకున్న మిత్రులను 'సాక్షి' పలుకరించగా.. సాయితో తమకున్న అనుబంధాన్ని వ్యక్తపరిచారు.


అమరచింతలో సాయిచంద్ తన తల్లి వర్ధంతి సందర్భంగా స్నేహితులతో.. (ఫైల్)

మంచి మిత్రుడిని కోల్పోయా



సాయిచంద్ బాల్యమిత్రుడే కాకుండా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు, ఆ తర్వాత ఇంటర్, డిగ్రీ వరకు కలిసే చదివాం. చదువుకున్న రోజుల్లో ఎక్కువగా మంచి పనులు చేయాలని, సమాజాన్ని పట్టి పీడిస్తున్న పెత్తందారి వ్యవస్థ గురించే చర్చించేవారు. అభ్యుదయ భావాలతో అందరికీ ఆప్త మిత్రుడయ్యారు. అలాంటి మిత్రుడిని కోల్పోవడం బాధాకరం.

– ఎం.శ్రీను, అమరచింత

ఉద్యమస్ఫూర్తి ఉండేది..



సాయిచంద్‌తో కలిసి చదువుకున్న రోజుల్లో ఎక్కువగా పేదల పక్షాన పోరాడే ఎర్రజెండా పార్టీలకు ఆకర్షితుడినయ్యాను. సాయి తన తండ్రితో కలిసి ఉద్యమ పాటలు పాడేవారు. నేకు కూడా అలాంటి భావాలు కలిగి ఉండటం వల్లే ప్రజా కళాకారుడిగా మారాను. సాయి స్ఫూర్తితో ప్రస్తుతం ఏఐటీయూసీ రాష్ట్ర సహ కార్యదర్శిగా కొనసాగుతున్నాను. సాయితో ఏడాదిలో ఒకసారి కలిసిన ఆనందంగా, సరదాగా గడిపేవాళ్లం. ఇక సాయి లేడు అన్న పదాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను.

– పి.సురేష్, అమరచింత

సామాజిక కార్యక్రమాలపై..



గత కొన్ని సంవత్సరాల కిందట సాయిచంద్ తన మిత్రులందరినీ ఒకే వేదికపై కలిపే ప్రయత్నం చేశారు. అప్పుడు ఏదైనా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఉందని, ఇందుకు స్నేహితులు తనకు సహకరించాలని కోరారు. మేమంతా అండగా ఉంటామని చెప్పడంతో సాయి తన తల్లి, అన్న జ్ఞాపకార్థం ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి వాటి ద్వారా నిరుపేదలకు సహకారం అందించేవారు. అలాంటి మంచి మనిషి సాయిని కోల్పోవడం బాధగా ఉంది.

– డీసీ దామోదర్, అమరచింత

ఎంత ఎదిగినా..



సాయిచంద్ ఎంత ఎదిగినా స్నేహితులతో తరుచుగా మాట్లాడేవారు. ఏడాదికి ఒకసారి సాయిచంద్ తన తల్లి జ్ఞాపకార్థం నిర్వహించే కార్యక్రమానికి అందరినీ ఆహ్వానించేవారు. స్నేహితులతో గడిపిన రోజులలో ఏనాడు పేద, గొప్ప అన్న తేడా చూపకుండా అందరినీ పలకరించే సాయి మన మధ్య లేడనే విషయాన్ని తట్టుకోలేకపోతున్నాం.

– రఘు, అమరచింత

జనసంద్రంగా మన్యంకొండ


స్వామివారి సన్నిధిలో భజన చేస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం గురువారం జనసంద్రమైంది. ఆషాడ శుద్ధ తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. తొలి ఏకాదశి వేడుకల సందర్భంగా స్వామివారికి అభిషేకం, అలంకారోత్సవం, వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే స్టేజీ సమీపంలోని అలివేలు మంగతాయారు దేవస్థానంలోనూ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారితో పాటు ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

'కురుమూర్తిస్వామి'కి లక్ష పుష్పార్చన

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం శివారు కాంచనగుహలో వెలసిన కురుమూర్తిస్వామికి ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశిని పురస్కరించుకొని గురువారం లక్ష పుష్పార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ప్రధాన ఆలయం వద్ద భూదేవి, శ్రీదేవి సమేతుడై శ్రీవేంకటేశ్వర ప్రతిరూపమైన కురుమూర్తిస్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ఆలయ అర్చకులు మంత్రోచ్చరణాలతో లక్ష పుష్పార్చన గావించారు. కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం చేశారు. అనంతరం కురుమూర్తిస్వామి సన్నిధిలో దాతల సహకారంతో నిర్మించిన దిగుడు మెట్లను ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


కురుమూర్తిస్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు లక్ష పుష్పార్చన చేస్తున్న అర్చకులు

హత్యా.. ప్రమాదమా?

- రెండు రోజుల కిందట అదృశ్యమైన వ్యక్తి
- రోడ్డు పక్కన గుంతలో మృతదేహం గుర్తింపు
- కర్ణాటకలో తెలంగాణ వాసి అనుమానాస్పద మృతి


శివరాజ్(ఫైల్)

మాగనూర్: మండలంలోని అమ్మపల్లికి చెందిన శివరాజ్(28) బుధవారం కర్ణాటక రాష్ట్రంలోని బల్చేడ్‌లోని సడ్డకుడు(తన భార్య పద్మమ్మ అక్క) పొలంలో వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్ తీసుకుని వెళ్లాడు. ఆ రోజు రాత్రి 8 గంటల వరకు పొలం పనులు చేసి భార్య తల్లి(అత్త) గ్రామమైన నంద్యాపల్లి(కర్ణాటక)కి సడ్డకుడి ద్విచక్రవాహంపై వెళ్లాడు. అయితే ఉదయం వరకు కూడా అటు అత్తారింటికి చేరకపోవడం, ఇటు తిరిగి ఇంటికి రాకపోవడంతో సమీప బంధువుల ఇళ్లలో వెతికారు. అయినా ఎక్కడికి రాకపోవడంతో సైదపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం చిన్నసంబురం అనే గ్రామ సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న ఓ గుంతలో అనుమానాస్పద మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. విషయం కుటుంబ సభ్యులకు తెలిసి సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి అది శివరాజ్‌గా గుర్తించారు. అయితే అతడి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రమాదవశాత్తు గుంతలో పడ్డాడా? లేకుంటే ఎవరైనా హత్య చేసి ద్విచక్కవాహనంతో సహా గుంతలో పడేశారా? అనే అంశం తెలియాల్సి ఉంది. ఈ విషయమై సైదపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం సైదపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.